మహితది ప్రేమవివాహం.

ఇంట్లో పెద్దలు యిష్టపడలేదు. నేనూ, మహితా చిన్నప్పటి నుండి స్నేహితులం. నన్ను సలహా అడిగింది. ఒక సాయంత్రం. ఇద్దరం వాళ్ళింటి ముందు లాన్‌లో కూర్చున్నాం.

ఏం చెప్పను? వద్దంటే వినే స్థితిలోలేదు. ఒక రోజంతా



# రాజీ

వల్లూరిపల్లి లక్ష్మి



కూర్చోబెట్టి క్లాసు తీసుకున్నాడు వాళ్ళనాన్న. చిన్నప్పటినుండీ అంతే మహిత. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు. అందుకని నేనన్నాను. 'కష్టమో, నిష్ఠురమో, ఏటికెదురీదదలచుకున్నావ్! నీ నిర్ణయం అయిపోయింది. ఇక ముందుకె వెయ్యి అడుగు'.

మహితకీ, గోపాల్‌కీ గుళ్ళోపెళ్ళి జరిగింది. స్నేహితులమే అందరం దగ్గరుండి పెళ్ళి జరిపించాం. వేరే యిల్లు తీసుకుని కాపురం పెట్టుకున్నారు. ముచ్చటగా,ముద్దుగా సాగుతోంది వాళ్ళ కాపురం.

గోపాల్‌ది చాలా సరళ స్వభావం.స్నేహానికి ప్రాణం యిస్తాడు. కాని ఆ నుదుటి రేఖల్లో, ఆ నిశితమైన చూపుల్లో ఒక విధమైన పట్టుదల కనిపిస్తున్నది.

మహితది తీవ్రస్వభావం. ఆగ్రహంమొచ్చినా, అనుగ్రహమొచ్చినా పట్టలేం.హడావుడి నిర్ణయాలు తీసేసుకుంటుంది. దేవుడు దిగివచ్చి చెప్పినా వినదు.

భిన్న ధృవాలు ఆకర్షించుకుంటాయి.

అందుకే అంత ప్రతి ఘటననూ ఎదుర్కొని తమ పట్టుదలను నెగ్గించుకున్నారు.మహితంటే మహితే అనుకున్నాన్నేను. ఆరేళ్ళ అందమైన,అనుకూల దాంపత్యానికి చిహ్నంగా యిద్దరు మగపిల్లలు.మోహిత్,లోహిత్.

మా వారికి ట్రాన్స్‌ఫరై మేము విశాఖ వెళ్ళిపోయాం. మహిత నన్ను వదలలేక కళ్ళనీళ్ళు పెట్టుకుంది. మా పిల్లలూ, మహిత పిల్లలు చాలా స్నేహంగా వుంటారు. మా పిల్లలు మహితను 'ఆంటీ' అంటూ చాలా అభిమానంగా వుంటారు. తనూ అంతే. అంత దగ్గరతనం, ఆత్మీయత.

ఆరేళ్ళ ట్రాన్స్‌ఫర్ల మీద తిరిగి మళ్ళీ విజయవాడ వచ్చిపడ్డాం. మహితతో గడిపి రావాలని బందరు వెళ్ళాను. లెటర్స్ వ్రాసుకుంటున్నాం. అందులో ఏదో అసంతృప్తి.అంతర్లీనంగా గోచరిస్తోంది. ఇద్దరికీ పడటంలేదట. ఎడ్డెం అంటే తెడ్డెం అన్నట్లు వుందట సంసారం. ప్రతి విషయానికి పేచీలు పడుతున్నారట. 'గొడవపడని రోజంటూ లేదు. విడాకులే బెటరునిపిస్తోంది. మా గొడవల మధ్య పిల్లలు దెబ్బతింటారేమో?' నంటూ రాసింది. హడలిపోయాను. 'ఇదేమిట్రా దేవుడా? యిలా జరిగింది?' అంటూ బుర్ర చెడగొట్టుకున్నాను.

నేను వెళ్ళే సరికి చీకటిపడుతోంది. నన్ను చూచి ఎంత సంభ్రమంగా రిసీవ్ చేసుకుంటుందోనని వూహించుకుంటూ వెళ్ళాను.

గుమ్మంలోకి వినిపిస్తున్నాయి,తీవ్రస్థాయిలో గొంతుకలు!

'నువ్వు మనిషివేనా అసలు! ఒఠ్ఠి పశువ్వి. ఎదుటి వాళ్ళతో ఎలా ప్రవర్తించాలో తెలియదు. ఛీ!ఛీ!'అంటోంది మహిత. ఒళ్ళు మరిచి మితిమీరిన కోపంతో గొంతు చించుకుంటోంది.

హాల్లో కూర్చుని వున్నాడు గోపాల్. ఏదో పేపరు దీక్షగా చూస్తున్నాడు. మహిత అరుపులు చెవికెక్కుతున్నట్లు లేదు.

'చెబుతూంటే నీ క్కాదూ? నీ కంటే ఆ గోడకి చెప్పటంనయం. అసలు నా ఫ్రండ్స్ వస్తే వాళ్ళతో నీకేమిటి మాటలు! వెకిలి మాటలూ, నువ్వూను! సిగ్గుతో చచ్చిపోతున్నాను.'

గోపాల్ నోరు విప్పాడు.' ఏం! నీ ఫ్రండ్స్‌తో మాట్లాడితే ఏమిటట తప్పు! అంత గొప్పవాళ్ళా మీరంతా? అబ్బో! దిగి వచ్చిన దేవతలురా!' వ్యంగ్యంగా నవ్వుతూ అంటున్నాడు గోపాల్. మాట ముద్దగా వస్తోంది. తాగిన మత్తులో మాట్లాడుతున్నట్లున్నాడు.

'మాట్లాడటం రాదు. పైగా యీ వెధవ అలవాటొకటి. మంచిమనిషి కో మాట. మంచి గొడ్డు కో దెబ్బ అన్నారు ఛీ! నీకన్నా పశువు నయం' మహిత అరిచింది.

నేను గోడకి ఆనుకుని రాయిలా నిలబడిపోయాను. గోపాల్ బయటికి వస్తూ నన్ను చూశాడు.నా కాళ్ళు తడబడ్డాయి. వీళ్ళ పరిస్థితి యింత దారుణంగా తయారయింది అనుకోలేదు నేను. గోపాల్ తాగుడుకి బానిసయ్యాడా! దీనికి మహితే బాధ్యురాలా? తప్పు ఎవరిది?

'మీరు.... మీరు.... 'తడబడుతూ అంటున్న గోపాల్‌ని తప్పించుకొని మా బంధువులింటికి వెళ్ళిపోయాను. నా మనసు పూర్తిగా వికలమయ్యింది.

ఆ రాత్రి మహిత వచ్చి నన్ను పట్టుకొని ఒకటే

> **సంసారం అంటే ఇద్దరు వ్యక్తుల కలయిక. అభిరుచుల సంగమం. సర్దుకుపోవటమే సంసారం. నీవు కోరుకున్నట్లు నూటికి నూరుపాళ్ళూ అలాగే ఎవ్వరూ వుండరు.**

ఏడుపు. జీవితం నరకప్రాయంగా వున్నదట. ఇద్దరి స్వభావాలూ కలవటంలేదట. తను అవున్నది కాదని, కాదన్నది అవునని వాదిస్తాడట. తనని కించపరచటమే పనిగా పెట్టుకున్నాడట.పిల్లల్ని కూర్చోబెట్టి తన మీద చెడుగా చెబుతున్నాడట.

'ఏం చెయ్యనే!' అంటూ ఒకటే ఏడుపు! ఇక నేను భరించలేనే! ఈ సంసారం నావల్లకాదు'.

ఆమెని శాంత పడనిచ్చి అన్నాను. 'సంసారం అంటే ఇద్దరు వ్యక్తుల కలయిక. అభిరుచుల సంగమం. సర్దుకుపోవటమే సంసారం. నీవు కోరుకున్నట్లు నూటికి నూరుపాళ్ళూ అలాగే ఎవ్వరూ వుండరు. జీవితంలో పిల్లలు కలిగి యింతదూరం వచ్చాక సంసారం అల్లరి చేసుకుని బావుకునేదేమిటి? పిల్లలు భవిష్యత్తూ ఆలోచించాలి కదా మహితా!'

'వ్వాట్! ఏమిటి నువ్వు చెప్పేది! సర్దుకుపోవటమా! నా డిక్షనరీ లోనే లేదా మాట!' అంటూ అదిరి పడింది. 'నన్నసలు లెక్క చెయ్యడు. నన్నెంత చులకనగా మరెంత నిరసనగా చూస్తున్నాడో తలచుకుంటేనే కంపరం పుడుతోంది. ఎన్ని మాటలంటాడో తెలుసా? తల పగలగొట్టుకొని చచ్చిపోవాలనిపిస్తుంది. విడాకులు తీసుకుంటాను. ఇక భరించలేను.' ఒకటే ఏడుస్తోంది నా ఒళ్ళోపడి.

మా తోడికోడలు ధైర్యం చెప్పింది మహితకి సలహాగా చెప్పింది. 'భార్యాభర్తలన్నాక ఏవో చిన్న చిన్న గొడవలు వుంటూ వుంటాయి. కొన్ని స్పోర్టివ్‌గా తీసుకోవాలి. సీరియస్‌గా తీసుకోకూడదు మహితా! కాస్త ఆవేశం తగ్గించుకొని ఆలోచించమ్మా! ప్రేమించుకొని పెళ్ళి చేసుకున్నారు! తొందరపడొద్దు' అంది నచ్చ జెబుతూ.

మహిత లేచి కూర్చుంది. కన్నీరు తుడుచుకుంది. 'నాకు విడాకులు తీసుకోవటమే శరణ్యమనిపిస్తోంది' అంది గాద్గదికంగా.

'తొందరపడకు. ఇదేమన్నా చిన్న పిల్లల ఆటనుకున్నావా? వద్దు అనుకుంటే జట్టు విడిపోవటానికి. ఆరోజు.. పెళ్ళికి మీ నాన్న ఒప్పుకోనప్పుడూ యిలాగే ఆవేశపడ్డావు. మొండికెత్తావు. ఇప్పుడు విడాకులు అంటున్నావు. పిల్లలున్నారు. తొందరపడి నిర్ణయాలు తీసుకొవద్దు' అన్నాను అనునయంగా.

'మరేం ఫర్వాలేదు. తండ్రి కంటే వెయ్యిరెట్లు గొప్పగా పెంచుతాను. ఛీ! దుర్మార్గుడు. రాక్షసుడు. తిట్ట బుద్ధేస్తోంది. ఛీ! భరించటమే కష్టంగా వుంది. నా జీవిత మేమిటి యిలా అయింది!' కళ్ళు వర్షిస్తున్నాయి. అంతటి ధీరోదాత్తురాలూ యిలాబేలగా మారిపోయిందేమిటో! కన్నీటి కడలి అయ్యింది వెక్కివెక్కి పడుతోంది.

పట్టుకొని ఓదార్చాను. నా మనస్సంతా వికలమయిపోయింది.స్నేహితురాలి కాపురం యిలా అయిపోయిందే అని.

ఆ మర్నాడు గోపాల్‌తో మాట్లాడాలని ఆయన ఆఫీసుకి ఫోనుచేస్తే రాలేదన్నారు. ఇంటికి వెళ్ళాను. మహిత స్కూలుకి వెళ్ళిపోయింది. ఏదైనా ప్రయత్నం చేసి యిద్దర్నీ కలిపి వుండేలా చెయ్యాలని నా తపన, ప్రయత్నం.

'రండి' అంటూ పడుకుని వున్న వాడల్లా లేచి వచ్చి కుర్చీ చూపించాడు కూర్చోమని.మంచినీళ్ళు తెచ్చి యిచ్చాడు కుశల ప్రశ్నలు వేశాడు.

మనిషి చాలా మారాడు.జీవితంలో చేదు మ్రింగిన వాడిలా వుంది వాలకం. చూపుల్లో ఏదో కసి! సౌమ్యత హరించిపోయినట్లుంది. కాలం మనిషిలో యింత మార్పు తెస్తుందా అని లోపల ఆశ్చర్యపోయాను.

నేనే చొరవ చేసుకుని అన్నాను. 'మహిత మిమ్మల్ని అర్థం చేసుకోలేదా? మీ అభిప్రాయాలు కలవటం లేదా? ప్రేమించి, పెద్దవాళ్ళును కాదని పెళ్ళి చేసుకున్న మీరు కలిసి వుండలేనటువంటి పరిస్థితి ఎలా వచ్చింది?'

గోపాల్ వేదాంతిలా నవ్వాడు. 'మహిత తనని తనే అర్థంచేసుకునే శక్తి లేని అమ్మాయి. ఇంకొకళ్ళని అర్థం చేసుకోగలదా? పెద్ద హిపోక్రట్ మహిత. మీకు తెలియదేమో! ఆమెకేం కావాలో ఆమెకే తెలియదు. ఇంకోళ్ళు చెబితే బుర్రకెక్కదు'.

నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. ఈయనలో విషయాన్ని విశ్లేషించి చెప్పే నేర్పువుంది.

'చాలా గర్విష్టి. తనను గురించే కాని పక్కవాళ్ళ గురించి ఆలోచించదు. విడాకులు కావాలట.

ఇకనైనా శాంతిగా బతకాలని వుందట ఆవిడకి. అలాగే విడాకులు యిస్తాను. హాయిగా బ్రతక మనండి' కక్షగా అన్నాడు.

'త్వరపడకండి. పిల్లలున్నారు. వాళ్ళ సంగతీ ఆలోచించాలి. ముందు ఒకళ్ళనొకళ్ళు మాటలను కోవటం మానితే మంచిదేమో?' అన్నాను.

స్నేహితురాలి కాపురం మూన్నాళ్ళ ముచ్చట అయినందుకు మనసులో ముల్లు గుచ్చుకొన్నట్లుగా వుంది నాకు. మనస్సులు కలవకపోయినా ఎంతమంది కాపురాలు చేసుకోవటంలేదు! విడిపోయి ఏం సాధిస్తారు!

సమాంతర రేఖలు సుదూరంలో ఎక్కడో కలిసినట్లు కనిపిస్తాయి. కాని కలవ్వు.అంతే.

కొన్నాళ్ళకి విడాకులు తీసుకున్నారు. మహిత ఫోన్ చేసి చెప్పింది. గోపాల్ కూడ ఫోన్ చేశాడు.

చాలా బాధ అనిపించింది. చేసేదేముంది?

ఒకళ్ళమీద మరొకళ్ళు కక్షలూ, కార్పణ్యాలు పెంచుకొన్నారు. ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి తెచ్చుకున్నారు.

ఒకసారి నాకు బందర్లో వుండే స్నేహితురాలు చెప్పింది. గోపాల్ ఆరోగ్యం పూర్తిగా చెడిపోయిందట. విపరీతమైన తాగుడు. జాబ్‌కి సరిగా వెళ్ళటం లేదట. కనీసం పిల్లల్ని కూడా తండ్రి దగ్గరకు వెళ్ళనివటం లేదట.

ఉస్సురని నిట్టూర్చుకొని, బాధపడి, వూరుకున్నాను.

రెండేళ్ళు గడిచిపోయాయి.

మహిత గుర్తుకు వస్తే మనసులో ముల్లు గుచ్చుకున్నట్లు బాధగా వుంటుంది నాకు. పిల్లల్ని పట్టుదలగా చదివిస్తోందట. తనకు పిల్లలే సర్వస్వం అయ్యారు. వాళ్ళు అన్ని సబ్జెక్ట్‌ల్లో ఫస్ట్ మార్కులు తెచ్చుకుంటున్నారట. బాగా మెరిట్‌గా చదువుతున్నారట.

ఆ రోజు ఫోన్ వచ్చింది నాకు. మధ్యాహ్నం వేళ. ఇంట్లో ఒక్కదాన్నే వున్నాను. గోపాల్ అక్క గారు మాట్లాడుతోంది అవతలనుంచి.

'ఏమిటి విషయం? గోపాల్ ఆరోగ్యం ఎలా వుందండీ?'అని అడిగాను.

ఆమె గొంతు గద్గదికమయినట్టుంది. నేను కంగారుపడ్డాను. 'ఏమిటి? ఏమయింది?'అంటూ ఆత్రంగా అడిగాను.

'గోపాల్ ఆరోగ్యం బాగుండటం లేదు. హాస్పిటల్‌లో వున్నాడు. ఒకసారి.. ఒకసారి...'

'ఏమిటండీ?చెప్పండి?'

'గోపాల్‌కి సీరియస్‌గా వుందమ్మా! చనిపోయే లోపు ఒకసారి మహితను చూడాలని వుందని అంటున్నాడు. లివర్ బాగా చెడిపోయిందంటున్నారు.'

'అయ్యో! అలాగా! నేను మహితకు ఫోన్ చేస్తాను. నేను వస్తాను' అన్నాను. మహిత ఏమంటుందో మరి!

వెంటనే నేనే వెళ్ళాను. ఫోన్ చేస్తే తిక్కపిల్ల! ఏమంటుందో అని చెయ్యలేదు. వెళ్ళి మహితను కలుసుకొని విషయం చెప్పాను. విని రాయిలా బిగుసుకొని కూర్చుంది. పన్నెత్తి ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

'నిన్ను చూడాలని వుందట. డాక్టర్లు అనుమానంగా చెప్తున్నారట' చెపుతూ మహితను గమనించాను.

తన కళ్ళలో నీళ్ళూరుతున్నాయి.

నిగ్రహించుకొలేకపోతున్నట్లుంది తన వాలకం చూస్తే కన్నీళ్ళు టపటపా రాలిపోతున్నాయి.

మహిత ఏడుస్తోంది. బేలగా! అతిబేలగా!!

కాస్సేపాగి అన్నాను.

'వెళ్ళి చూసొద్దామా? మహితా?'

చివ్వున లేచింది మహిత. 'పాడుదాన్ని' ఎంత సాధించాను. ఎప్పుడూ అరుస్తూ, తిడుతూ, దయ్యం పట్టినట్లు, ఆయన్ని సాధించి, సాధించి మనశ్శాంతి లేకుడా చేశాను. ఆవేశమే తప్ప ఆలోచన లేకుండా ప్రవర్తించాను' అంటూ గబగబా రడీ అయింది. పిల్లల్ని కూడ తీసుకువెళ్దామంది.

విడాకులయ్యాక యీ మధ్యకాలంలో మహితలో మార్పు వచ్చినట్లు నాకనిపించింది. కాస్త వివరం వచ్చినట్లుంది. ఆ దూకుడు తగ్గింది. యోగా చేస్తున్నానని, రోజూ ధ్యానం కూడా చేస్తున్నాననీ ఆ మధ్య చెప్పినట్లు గుర్తు వచ్చింది.

**నాకు ఒర్పు తక్కువ. గోపాల్‌కి కోపం ఎక్కువ. ఇద్దరం రెచ్చిపోయాము. ఇప్పుడు తెలుస్తోంది. జీవితం సవ్యంగా ఒక గాడిలో నడవాలంటే కొన్నిటిని వదులుకోవాలి. మరి కొన్నిటిని నేర్చుకోవాలి**

ఈ మార్పు మంచికే. కాస్త తృప్తి అనిపించింది. గోపాల్ ఎలా వున్నాడో పాపం!

మేం వెళ్ళేసరికి, గోపాల్‌కి మందు యిస్తూ కనిపించింది వాళ్ళక్క. చిక్కి, శల్యమైపోయి వున్నాడు గోపాల్. ముఖం వాడి కళ్ళుపాలిపోయి...

పిల్లలు బెరుగ్గా చూస్తూ నిలబడ్డారు. చిన్నవాడు పరుగున వెళ్ళాడు 'నాన్నా'! అంటూ.

దగ్గరకు వచ్చిన కొడుకును గుండెలకు హత్తుకున్నాడు గోపాల్. ఆ దృశ్యం చూస్తూ నిలబడింది మహిత. ఆమె కళ్ళల్లో ఎన్నో నీలినీడలు!

గోపాల్ అక్క రాజేశ్వరి మహిత దగ్గరగా వస్తూ 'ఎలా వున్నావమ్మా!మహీ! అంటూ పలకరించింది.

ఒకక్షణం ఆమె వంక చూచి ఆమెను అతుక్కుపోయింది మహిత. 'వదినా? గోపాల్ కేమయింది? డాక్టరేమన్నాడు?' ఆమె కంఠంలో కంగారు, ఆవేదన ధ్వనిస్తున్నాయి.

ఆమె మౌనంగా చూస్తోంది. వెంటనే మాట్లాడలేదు. ఆ తర్వాత నెమ్మదిగా అంది. 'గోపాల్ ఎలా వుంటే నీ కేమిటి మహీ! మీ ఇద్దరూ బంధం తెంపేసుకున్నారు కదమ్మా! ఇప్పుడీ ఏడుపెందుకు?'

మహిత ఏడుస్తోంది. ఆ దుఃఖం తీవ్రస్థాయిలో వుంది.

అంత ధైర్యశాలి మహిత ఏడవటమేమిటి? పరిస్థితులకు రాజీపడే స్వభావం కాదు ఆమెది.

రాజేశ్వరి నావంక చూసింది. ఇద్దరం సైగ చేసుకున్నాం. రాజేశ్వరి అంది– 'ఎందుకు మహీ మీ యిద్దరూ మమతలు దాచుకొని విభేదాలు పెంచుకున్నారు? నీ మీద బెంగతో మా తమ్ముడు ఎలా అయిపోయాడో చూడు!? అంటూ మహితను గోపాల్ దగ్గరగా లాక్కెళ్ళి 'ఇంక నీ భర్తను నీవే కాపాడుకో తల్లీ!' అంటూ బయటికి వచ్చేసింది. నేనూ ఆమె వెనుకే వచ్చేశాను. వస్తూ వెనక్కి చూశాను.

గోపాల్ మహిత వంక ఆర్తిగా చూస్తూ ఆమె వంక చేయిచాచాడు. మహిత గభాలున ఆ చేయి అందుకుని గోపాల్ పక్కన కూర్చుంది. నాకు ఎంతో ఆనందం కలిగింది ఆ దృశ్యం చూస్తుంటే.

పొడుగ్గా వున్న వరండాలో మెల్లగా నడుస్తూ మాట్లాడుకుంటున్నాం రాజేశ్వరీ, నేనూ. 'ప్రేమలున్నాయి. కాని కోపతాపాలు ఎక్కువైనాయి' అనుకున్నాం. దాదాపు అరగంట తర్వాత రూమ్‌లో మాకు కనిపించిన దృశ్యం.

గోపాల్‌కి టాబ్లెట్ యిచ్చి మంచినీళ్ళు యిచ్చింది మహిత. అది వేసుకుని, నీళ్ళు తాగి, మహిత చీరెకొంగుతో మూతి తుడుచుకొని దిండుకానుకుని కూర్చున్నాడు గోపాల్. ముఖంలో ఎంతో సంతోషం! లోకంలో ఆనందం అంతా వాళ్ళిద్దరి వదనాల్లోకే వచ్చి చేరినట్టుంది. పిల్లలిద్దరూ తండ్రి ఒళ్ళోకూర్చున్నారు.

మరో పదిహేను రోజుల తర్వాత....

గోపాల్ ఆరోగ్యం బాగా కుదుటపడిందనీ, బాగా కోలుకుంటున్నాడనీ మహిత ఫోన్‌లో చెప్తుంటే నా ఆనందం ఏమని చెప్పను?

డాక్టరే ఆశ్చర్యపోయాడట. 'ఇంత త్వరగా కోలుకోగలగటం నిజంగా అద్భుతం' అన్నాడట. ఆ క్రెడిట్ అంతా మహితదే అన్నాడట.

'మహితా! మీ యిద్దరూ నిజంగా ప్రేమికులే. ఒకరిని విడిచి మరొకరు వుండలేరు. మరెందుకు యింతలా గొడవలు పెంచుకున్నారు? విడాకుల దాకా ఎందుకు వచ్చారు?'నేను అడిగాను.

మహిత కాస్సేపు మౌనంగా వుండి తర్వాత అంది. 'నన్ను నేను విమర్శించుకుంటూ విశ్లేషణ చేసుకున్నా. నాకు ఒర్పు తక్కువ. గోపాల్‌కి కోపం ఎక్కువ. ఇద్దరం రెచ్చిపోయాము. ఇప్పుడు తెలుస్తోంది. జీవితం సవ్యంగా ఒక గాడిలో నడవాలంటే కొన్నిటిని వదులుకోవాలి. మరి కొన్నిటిని నేర్చుకోవాలి' అంది. నవ్వుతోంది కూడా.

'ఎంత బాగా చెప్పావు మహీ! బెస్టాఫ్ లక్. మరి వుండనా!'

ఫోన్ పెట్టేశాను. ఎప్పుడో చదివిన గేయం ఒకటి మదిలో మెదిలింది.

'మరల మరల దొరుకనట్టి వరమీ బ్రతుకు!
బతకలేక దాన్ని నీవు.
బలి చేయబోకు!!

★